మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ్

అంతా అయోమయం..!

- నర్సు పోస్టుల భర్తీకి రివైజ్డ్ నోటిఫికేషన్
- డిడి పేరు మార్చడంతో ఇబ్బందులు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖలోని స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీలో అయోమయం ఏర్పడింది. రివైజ్డ్ నోటిఫికేషన్ విడుదల చేయడం, అందులో డిడి తీయాల్సిన పేరు మార్చడంతో అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు...

రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖలోని స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి నాలుగు రోజుల క్రితం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 461 పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 6 వరకు రీజనల్ డైరెక్టర్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించారు. దరఖాస్తు రుసుం ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.500, ఎస్సీ, ఎస్టీ, వికలాంగ అభ్యర్థులు రూ.300 డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ పేరుతో డిడి తీసి సమర్పించాల్సి ఉంది. గురువారం సవరించిన (రివైజ్డ్) నోటిఫికేషన్ విడుదల చేశారు. పోస్టుల సంఖ్యను 1404కు పెంచారు. దరఖాస్తుల సమర్పణకు ఈనెల 8 వరకు గడువు పెంచారు. కానీ డిడి తీయాల్సిన చిరునామాను ఆయా జోన్ల రీజనల్ డైరెక్టర్‌గా మార్చారు. ఇప్పటికే డిడి తీసిన అభ్యర్థులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. మళ్లీ కొత్త డిడి తీయాలా అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలువురు అధికారులను కోరగా కొత్త చిరునామాతోనే డిడి ఉండాలని, గతంలో డిడి తీసిన బ్యాంకుకు వెళితే చిరునామా మార్చి ఇస్తారని సూచించారు. అది తెలియని చాలా మంది అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాంతో పాటు దరఖాస్తులను రీజనల్ కార్యాలయాల్లో సమర్పించాలని ఉండడంతో కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన అభ్యర్థులు కూడా కడపకు వెళ్లి దరఖాస్తు ఇవ్వాల్సి వస్తోంది.

నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాటం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ్ - ఘనంగా ఎస్ఎఫ్ఐ 46వ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు/నందవరం

నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శి నరసింహా, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లప్ప తెలిపారు. శుక్రవారం ఎమ్మిగనూరులో ఎస్ఎఫ్ఐ 46వ జిల్లా మహాసభలు నిర్వహించారు. ముందుగా వైఎస్ఆర్ సర్కిల్ నుంచి శ్రీనివాస్ సర్కిల్, సోమేశ్వర టాకీస్, తేరుబజార్, గాంధీ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా సోమప్ప సర్కిల్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు రంగప్ప జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నూతన జాతీయ విద్యా విధానం వల్ల విశ్వవిద్యాలయాలను మూసివేసే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ కళాశాలలు లేకపోవడంతో డిసెంబర్ వరకు ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు జరగడం లేదని చెప్పారు. పేద విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరే అవకాశాలను చేజారుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వసతి దీవెనను తగ్గించుకునేందుకే రెగ్యులర్ అడ్మిషన్లు ఇవ్వడం లేదని తెలిపారు. ఎన్నో రూ.కోట్లతో అభివృద్ధి పనులు చేస్తామంటున్న ప్రభుత్వం రూ.90 కోట్లు పెట్టి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ప్రతి విద్యార్థికీ అమ్మఒడి అందించేందుకు నిబంధనల్లో సడలింపు ఇవ్వాలని కోరారు. 8వ తరగతి నుంచి బైజూస్ ద్వారా విద్యార్థులకు విద్యాబోధనను ప్రోత్సహించడంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో 47 వేల ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఉంటే వాటిని 7 వేలకు కుదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని తెలిపారు. 1.88 లక్షల ఉపాధ్యాయులు పోస్టుల్లో 88 వేల పోస్టులను కోత పెట్టేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. 8వ తరగతి వరకు మాతృభాషలోనే విద్యా బోధన చేపట్టాలని, కొఠారి విద్యా కమిషన్ ప్రకారం విద్యా వ్యవస్థ నడిస్తే ప్రతి విద్యార్థీ ఉన్నత చదువులు చదివి, మంచి ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 6 లక్షల మంది మాత్రమే చదువుకుంటున్నారని చెప్పారు. నిరక్షరాస్యతలో రాష్ట్రంలోనే కోసిగి మండలం ప్రథమ స్థానంలో ఉందని, రెండో స్థానంలో కౌతాళం ఉందని తెలిపారు. ఆ మండలాల వెనుకబాటు తనానికి ఇరిగేషన్ ప్రాజెక్టులు లేకపోవడమేనని కారణమని చెప్పారు. రాయలసీమ యూనివర్సిటీలో 98 మంది రెగ్యులర్ ప్రొఫెసర్లు ఉండాల్సి ఉండగా, నలుగురు మాత్రమే ఉన్నారని తెలిపారు. పిహెచ్‌డిలు లేని విశ్వవిద్యాలయంగా ఆర్‌యు పేరుగాంచిందన్నారు. సరైన విద్యా అవకాశాలు లేకపోవడంతో ఉద్యోగావకాశాలు లేక నిరుద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, నాయకులు ఆదోని శ్రీనివాసులు, ఆలూరు లక్ష్మి నారాయణ, కర్నూలు సాయి ఉదయ్, ఎమ్మిగనూరు విజయ్, అజిత్, ఆస్పరి రవి, మద్దికెర రవి, పత్తికొండ వినోద్, దేవనకొండ హరికృష్ణ, గోనెగండ్ల వీరన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శి నరసింహా

ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

బిజెపి దౌర్జన్యాలను ప్రతిఘటించండి

- త్రిపుర సిపిఎం నాయకులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి - కర్నూలు కలెక్టరేట్ ఎదుట నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

త్వరలో త్రిపుర రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో ప్రతిపక్ష సిపిఎంను ఎదుర్కోలేక బిజెపి దాడులకు పూనుకుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. ప్రభాకర్ రెడ్డి అన్నారు. సిపిఎం కార్యాలయంలో కార్యకర్తలు నాయకులపై దాడి చేసిన బిజెపి మూకలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి అనుసరిస్తున్న దౌర్జన్య కాండను ప్రతి ఒక్కరు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. త్రిపురలో సిపిఎం నాయకులు కార్యకర్తల పైన జరిగిన హత్య, దాడికి నిరసనగా సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ నిరసనలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి నారాయణ మాట్లాడారు. 2018లో త్రిపురలో అప్రజాస్వామిక పద్ధతిలో, ప్రజాధనం లూటీ చేసి, మతోన్మాదాన్ని రెచ్చగొట్టి బిజెపి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న సిపిఎం నిత్యం ప్రజాసమస్యలపై పనిచేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. అధికార దర్పంతో బిజెపి గూండాలు సిపిఎం కార్యాలయాలపై దాడులకు పూనుకుంటుందన్నారు. ప్రతిపక్ష సిపిఎం త్రిపుర రాష్ట్ర వ్యాపితంగా బిజెపి విధానాలు ఎండగడుతూ ప్రజలను ఐక్యం చేస్తూ, ఆక్రమించిన పార్టీ కార్యాలయాలను స్వాధీనం చేసుకుని కార్యాలయాలను ప్రారంభించేందుకు సన్నద్ధమైందన్నారు. స్థానిక నాయకులు షాహిద్ మియాను, కార్యకర్తను బిజెపి హత్య చేసిందన్నారు. మరికొందరిపైన దాడి చేశారని, విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు మాజీ ఆర్థిక మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే భానులాల్ సాహుపై దాడి చేశారన్నారు. ఇప్పటికైనా బిజెపి తన వైఖరిని మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు మాట్లాడారు. సిపిఎం నాయకులు సుభాన్, విజయ్, సాయిబాబా, ప్రభాకర్, రామకృష్ణ, కృష్ణ, నగేష్, వెంకట రాముడు, ప్రభాకర్, నరసింహులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసననుద్దేశించి మాట్లాడుతున్న

ఫ్యామిలీ డాక్టర్ విధానంపై పర్యవేక్షణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఫ్యామిలీ డాక్టర్ విధానంపై నిరంతరం పర్యవేక్షణ పెరగాలని చీఫ్ సెక్రటరీ డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం అమరావతి నుంచి ఆయన జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చీఫ్‌సెక్రటరీ డాక్టర్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రౌండింగ్ కాని ఇళ్లు ఇంకా ఏవైనా ఉంటే త్వరగా మొదలు పెట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి శనివారం హౌసింగ్ రోజుగా ప్రతిపాదించిందన్నారు. జిల్లాలో ప్రతి శనివారం హౌసింగ్‌డే నిర్వహించి ఇళ్ల నిర్మాణాల పనులలో పురోగతి సాధించాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలకు సంబంధించి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. స్పందనకు సంబంధించి అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి మండలానికి ఒక స్పెషల్ ఆఫీసర్‌ను కేటాయించామని, వాళ్ళు తనిఖీలు నిర్వహిస్తున్నారా లేదా, ప్రతి శనివారం హౌసింగ్ డే నిర్వహిస్తున్నారా లేదా అని సంబంధించిన నివేదికలు ఇవ్వాలని హౌసింగ్ పిడిని ఆదేశించారు. ప్రతి రోజు ఉపాధి హామీ పథకం కింద ఎంత మంది కూలీలు వచ్చారనే నివేదికను కూడా ఇవ్వాలన్నారు. గర్భవతులు ఆసుపత్రిలో రిజిస్టర్ చేసుకున్నప్పటి నుండి వారి ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని, హై రిస్క్ ప్రెగ్నెన్సీ మహిళలను ప్రసవానికి వారం రోజులు ముందుగానే ఆస్పత్రిలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్‌ఒను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని , నీటికి సంబంధించిన పథకాల గురించి కూడా మ్యాప్ తయారు చేసి ఇవ్వాలని ఆర్‌డబ్ల్యుఎస్‌ఎస్‌ఇని ఆదేశించారు. కర్నూలు కార్పొరేషన్ భార్గవ్ తేజ, సిపిఒ అప్పలకొండ, ప్రొబేషనరీ డెప్యూటీ కలెక్టర్లు ఎన్.మనోజ్ రెడ్డి, జి.వి.రమణ కాంత్ రెడ్డి జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చీఫ్ సెక్రటరీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలులోనే న్యాయరాజధాని

- 5న రాయలసీమ గర్జనలో న్యాయవాదులు పాల్గొనాలి
- రాయలసీమ గర్జన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలులో న్యాయరాజధాని ఏర్పాటు చేయాలని కోరుతూ కర్నూలు నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కర్నూలు ఎంపి డాక్టర్ సంజీవ్ కుమార్, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, నగర మేయర్ బివై.రామయ్య, కర్నూలు అబ్జర్వర్ కర్రా హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈనెల 5న నిర్వహించబోయే రాయలసీమ గర్జన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులు రాష్ట్ర విభజన నేపథ్యం నుంచి పోరాటం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి కర్నూలుకు న్యాయ రాజధాని ప్రకటించారన్నారు. కానీ ప్రతిపక్ష పార్టీలు దీనిని జీర్ణించుకోలేక అసత్య ఆరోపణలు చేస్తున్నాయన్నారు. హైకోర్టు వస్తే వాణిజ్యం, వ్యాపారం ,రోడ్డు రవాణా అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందని, తప్పకుండా న్యాయవాదులు రాయలసీమ ప్రజలు డిసెంబర్ 5న జరగబోయే రాయలసీమ గర్జన కార్యక్రమంలో పాల్గొని మన గొంతుకను వినిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎంఆర్. కృష్ణ, ఓంకార్, లక్ష్మీనారాయణ, సుబ్బయ్య, శ్రీత్రా సత్యనారాయణమ్మ, సుదర్శన్, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు

ఎపిఎన్‌జిఒ సంఘం నేతలతో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన

ఉద్యోగులకు అండగా ఉంటాం

ఎపిఎన్‌జిఒ సంఘం నేతలతో మంత్రి బుగ్గన

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎపిఎన్‌జిఒ సంఘం నేతలతో పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని ఎపి ఎన్‌జిఒ సంఘం నేతలు కలిసి పలు సమస్యలను విన్నవించారు. ఉద్యోగులకు ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పిఆర్సి బకాయిలు, డిఎ అరియర్స్ తో పాటు జిపిఎఫ్ లోన్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీటన్నిటిని ఒక్కొక్కటి పరిష్కరించేందుకు దృష్టి సారిస్తామన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంగల్ రెడ్డి, జవహర్ లాల్ నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాశన్న ,పాండురంగారెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి ఇతర నాయకులు పాల్గొన్నారు

యనగండ్ల హైస్కూల్ లో మానిటరింగ్‌బృందం

ప్రజాశక్తి- సి బెళగల్

మండలంలోనీ యన గండ్ల హైస్కూలులో మానిట రింగ్ విజిలెన్స్ బృందం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారి నాగరాజు యాదవ్ బియ్యం, గుడ్లు స్టాకును పరిశీలించి గుడ్ల బరువును చూసారు. అలాగే మిడ్ డే మీల్స్ నాణ్యతను తనిఖీ చేసి కొత్త మెనూను సక్రమంగా అందించాలని మధ్యాహ్న కార్మికులతో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఇఒ జ్యోతి,హెచ్‌ఎం వెంకటేశ్వర్లు గౌడ్ సిబ్బంది,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెత్తసంపద పనులపై ఎంపిడిఒ అసంతృప్తి

ప్రజాశక్తి-సి బెళగల్ : మండలం లోని ఈర్ల దీన్నెలో చెత్తసంపద కేంద్రం పనులు ఆగిన తీరుపై ఎంపిడిఒ రాముడు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కేంద్రంలో లభించే ఎరువులు పంటలకు ఉపయోగకరమని తెలిపి నిర్లక్ష్యం వీడాలని హెచ్చరించారు. అనంతరం కొత్తకోటలో సర్పంచి శ్రీనివాసులు చేతుల మీదుగా రైతుభరోసా కేంద్రం నిర్మాణానికి భూమి పూజ చేశారు.

ఇతినా కంపెనీ భూములను రైతులకు స్వాధీనం చేయాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని మంత్రి గుమ్మనూరు జయరాం కొన్న ఇతినా కంపెనీ భూములను రైతులకు తిరిగి దక్కేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి డిమాండ్ చేశారు. ఆస్పరి మండలంలోని ఆస్పరి, పెద్దహోత్తూరు, చిన్నహోత్తూరు గ్రామాల రైతుల భూములను 2006లో ఔషధాల తయారీ మొక్కల ప్లాంటేషన్ , పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని రైతుల నుండి కారు చౌకగా 443 ఎకరాల భూములను ఇతినా కంపెనీ యాజమాన్యం కొనుగోలు చేసిందని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూములను కొనుగోలు చేసిన సందర్భంగా ఆ ప్రాంతంలో భూములు ఇచ్చిన ప్రతి రైతు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ కూడా ఇచ్చిందన్నారు. ఇన్ని సంవత్సరాలు గడిచినా ఆ భూమిలో ఎలాంటి ప్లాంటు నిర్మాణం చేయలేదన్నారు. పరిశ్రమ నిర్మాణం చేయకపోతే తిరిగి ఆ భూములను రైతులకు స్వాధీన పరచాలన్నారు. పరిశ్రమ యాజమాన్యం, అధికార పార్టీ నాయకులు మంత్రి జయరాం కుమ్మక్కై ఆ భూములను రైతులకు దక్కకుండా కారుచౌకగా కొనడం దారుణమన్నారు. ఇదంతా జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళప్పగించి చూస్తూ ఉండడం బాధాకరమన్నారు. ఒకవైపు ప్రజలకు ఉపాధిలేక నిత్యం వలసలు వెళ్లే ఈ ప్రాంతంలో రైతుల భూములు లాక్కుని పరిశ్రమలు ఏర్పాటు చేయకపోవడం, ఉపాధి చూపించకపోవడంతో ఆ రైతు కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. ఇలాంటి సందర్భంలో ఆ కుటుంబాలను ఆదుకోవడం ప్రభుత్వం బాధ్యతని, వారి భూములను వారికి స్వాధీనపరిస్తే ఆ రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకున్నట్టు అవుతుందన్నారు. తమ భూములను తమకు ఇవ్వండని, కంపెనీ తమకు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇస్తామని రైతులు అనేకసార్లు ఆందోళన కూడా చేశారన్నారు. కానీ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. అలా చేయకుండా బాధ్యతగల మంత్రి స్థానంలో ఉండి కూడా రైతులు అనేకసార్లు విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ ఆ భూములు రైతులకు దక్కకుండా తాను తక్కువ ధరకు రిజిస్ట్రేషన్ చేసుకోవడం బాధ్యతారహితమన్నారు

దుప్పట్లు స్వెట్టర్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

వృద్ధులకు దుప్పట్లు,స్వెట్టర్లు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : కర్నూలు బుధవారం పేటలో ఆదరణ డేకేర్ సెంటర్‌లోని వృద్ధులకు శుక్రవారం డాక్టర్ శంకర్‌శర్మ ఆర్థికసహాయంతో స్వెటర్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డక్టర్ శంకరశర్మ మాట్లాడుతూ చలికాలంలో నిరుపేద వృద్ధుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చలికాలంలో చర్మం పగిలినట్లుందని , హార్ట్‌స్ట్రోక్ వచ్చే ప్రమాదాలున్నాయన్నారు. వారి శరీరంలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుందని అందుకే స్వెట్టర్లు, దుప్పట్లు వాడుకోవాలన్నారు. వృద్ధులు చర్మానికి కొబ్బరినూనెతో ఉదయం , రాత్రి కొద్దిగా రాసుకుంటే చలి సమస్యలకు దూరంగా ఉండొచ్చని అన్నారు. నిరుపేదల పట్ల ప్రేమ, ఆదరణ చూపించి చేతనైనంత సహాయం అందించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు తాను చేస్తున్నానన్నారు. మహాకవి గురజాడ సొంతలాభం కొంతమానుకొని పొరుగువారికి తోడ్పడ వోయ్... అని అన్నారన్నారు. ఈ సంస్థలను నడుపుతున్న రంజిత్‌కుమార్‌ను అభినందించడం నాకెంతో ఆనందం కలిగిందన్నారు. సంస్థ ప్రతినిధులు రాఘవేంద్ర, వృద్ధులు పాల్గొన్నారు.

ఎస్‌టిబిసి మైదానాన్ని పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

కర్నూలులో ఈనెల 5న తలపెట్టిన రాయలసీమ లక్ష గర్జన కార్యక్రమం సంధర్భంగా జిల్లా ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ శుక్రవారం కర్నూలు నగరంలోని బహిరంగ సభ , పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి వికేంద్రీకరణకు, కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటుకు, మూడు రాజధానులకు మద్ధతుగా డిసెంబర్ 5న కర్నూలు నగరంలోని ఎస్‌టిబిసి మైదానంలో జరగబోయే రాయలసీమ లక్ష గర్జన కార్యక్రమం గురించి ఎస్‌పి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఉమ్మడి జిల్లాల నుండి ఈ బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏయే రూట్లలో రావాలి, వాహనాలలో వచ్చిన వారు ఆ వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేసుకోవాలో పోలీసు అధికారులకు పలు సూచనలు , సలహాలను జిల్లా ఎస్‌పి తెలిపారు. వాహనాలకు, ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా కర్నూలు ఎస్‌టిబిసి కళాశాల, సుంకేశుల రోడ్డు లో ఉన్న సెయింట్ జోసఫ్ కళాశాల, ఎపిఎస్‌పి 2వ బెటాలియన్, కర్నూలు మెడికల్ కళాశాల, జిల్లా పరిషత్ , ఎగ్జిబిషన్ గ్రౌండ్, కోల్స్ కళాశాల మైదానాలలో పార్కింగ్ స్థలాలను జిల్లా ఎస్పీ పరిశీలించారు. జిల్లా ఎస్పీ వెంట సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్, అడిషనల్ ఎస్‌పిలు డి. ప్రసాద్, జి.నాగబాబు, కర్నూలు పట్టణ డిఎస్‌పి కెవి మహేష్, సిఐలు శ్రీనివాసులు, ఎస్ఐలు ఉన్నారు.

ఎస్‌టిబిసి కాలేజ్ మైదానాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి

అశాస్త్రీయ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయండి : పిపిఎస్ఎస్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరంలోని పలు కాలనీలో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు చేపడుతున్న అశాస్త్రీయ నిర్మాణ పనులకు అడ్డుకట్ట వేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం (పి పి ఎస్ ఎస్) బందం కోరింది. ఈ సందర్భంగా ఆ సంఘం ప్రతినిధి బృందం వైసిపి జిల్లా కార్యాలయంలో మేయర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పిపిఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు డి.సుకుమార్ మాట్లాడుతూ కర్నూలు నగరం, రిచ్మండ్ కాలనీలో నిర్మిస్తున్న భారీ మురుగు కాలువ స్థానిక ప్రజలకు ప్రమాదకరంగా మారబోతుందన్నారు. 3వేల కుటుంబాలకు 8 అడుగుల విసస్తీర్ణంలో తవ్వి ఒకే కాలువ నిర్మించబోతున్నారన్నారు. పలు వీధుల మురుగునీరు కలిసే చివరి ప్రాంతంలో పెద్ద కాలువ నిర్మించే పద్ధతిని ఇంజనీర్లు విస్మరిస్తున్నారన్నారు. దాదాపు 3వేల కుటుంబాలకోసం 8అడుగులు విస్తీర్ణంలో తవ్వి ఇళ్ళ ముందు ఓపెన్ (మూత లేని) మురుగు కాలువ నిర్మించేందుకు కాంట్రాక్టర్ ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కాలువ ర్మాణం స్థానిక ప్రజలకు ప్రమాదకరంగా మారు తుందని అన్నారు. ఇంజనీర్ల అశాస్త్రీయ నిర్ణయాలను అడ్డుకోవాలని మే యర్‌ను కోరారు. మేయర్ మాట్లాడుతూ స్థానిక ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రమాదాలకు గురి కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మేయర్ ని కలిసిన ప్రతినిధి బృందంలో ఏ నాగరాజు, డి.సుకుమార్, ఎం.నాగరాజు ఉన్నారు.

మేయర్‌కు వినతిని ఇస్తున్న పుల్లారెడ్డి

స్నేహభావంతో క్రీడా పోటీలుండాలి

జిల్లా క్రీడా శాఖ సిఇఒ
పివి రమణ

ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్ : విద్యార్థులు స్నేహభావంతో క్రీడల్లో పాల్గొన్నప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చని జిల్లా క్రీడా శాఖ సిఇఒ వివి రమణ సూచించారు. శుక్రవారం నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాల క్రీడా మైదానంలో రాయలసీమ యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళల వాలీబాల్, కబడ్డీ,ఖో-ఖో, చెస్, యోగ, సెపక్తక్రా పోటీలకు సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవిఎస్‌కుమార్, సెయింట్‌జోసెఫ్ డిగ్రీ కళాశాల అకాడమిక్ ఇంచార్జ్ శౌరీలురెడ్డి, రాయలసీమ యూనివర్సిటీ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ కెవి. శివకిషోర్, పోటీల నిర్వహణ కార్యదర్శి డాక్టర్ వై.కల్యాణ్ కుమార్, డిగ్రీ కళాశాల వ్యాయామ అధ్యాపకుల సంఘం చీఫ్ పాట్రన్ రఫీక్ అహ్మద్‌తో కలిసి సిఇఒ రమణ ప్రారంభించారు. రమణ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్స హించడంలో పాటు క్రీడలు నిర్వహించడంలో సిల్వర్ జూబ్లీ కళాశాల చేస్తున్న కృషి వెలకట్టలేని దన్నారు. ఇంచార్జ్ శౌరీలు రెడ్డి మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో రాణించేందుకు తాము ఎల్లప్పుడూ కృషి చేస్తామని అన్నారు. యూని వర్సిటీ ఆధ్వర్యంలో ఏ క్రీడా పోటీలు నిర్వహించినా తమ విద్యాసంస్థల నుంచి సిద్ధంగా ఉంటామన్నారు. అంతకు ముందు వివిధ కళాశాల మహిళ విద్యార్థుల నుండి అతిధులు గౌరవ వందనాలు స్వీకరించారు.

విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న శౌరీలురెడ్డి

శాస్త్ర విజ్ఞానమే మిన్న...

- జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ హరి ప్రసాద్ యాదవ్, సిఐ శ్రీరామ్

ప్రజాశక్తి - ఆదోని

కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐ శ్రీరామ్

మూఢ నమ్మకాల కన్న శాస్త్ర విజ్ఞానమే మిన్న అని, ఇంకెన్నాళ్లీ మూఢ నమ్మకాలు అని జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ హరి ప్రసాద్ యాదవ్ ప్రశ్నించారు. శుక్రవారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో జన విజ్ఞాన వేదిక, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ ఛైర్మన్ వి.సంజన్న అధ్యక్షతన 'మూఢ నమ్మకాలు, శాస్త్ర విజ్ఞానం'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హరి ప్రసాద్ యాదవ్, సిఐ శ్రీరామ్, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిరీషా దీప్తి, రైట్ ఇన్ఫర్మేషన్ యాక్ట్ జిల్లా అధ్యక్షులు హుస్సేనప్ప, లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు రంజాన్ మాట్లాడారు. విద్యార్థులు మూఢ నమ్మకాల వైపు మొగ్గు చూపకుండా శాస్త్రీయ విజ్ఞానం పెంచుకోవాలని తెలిపారు. విద్యార్థులు యుక్త వయస్సులో చెడు వ్యసనాలకు లోనై తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయొద్దన్నారు. జెవివి సభ్యులు నాగార్జున ఆధ్వర్యంలో దాదాపు 500 మంది విద్యార్థులకు ఉచితంగా బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.గోవిందరాజులు, అధ్యాపకులు హసీనా బేగం, కాంతమ్మ, విమల, రాజేశ్వరి, రంగమ్మ, సూర్య బాబు, బడేసాహెబ్, శ్రీనివాసులు, రామాంజనేయులు, బాబు, నరసింహులు, ఈరన్న పాల్గొన్నారు.

పనులు కల్పించి వలసలు నివారించాలి

- డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి- దేవనకొండ

సమావేశంలో మాట్లాడుతున్న పీడీ అమర్‌నాథ్ రెడ్డి

ఉపాధి హామీ చట్టం కింద పని చేస్తున్న జాబ్ కార్డు కలిగిన ప్రతి వ్యవసాయ కూలీకి పనులు కల్పించి వలసలు నివారించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్ రెడ్డి కోరారు. శుక్రవారం మండలం సిఎల్ఆర్‌సి భవనంలో ఉపాధి సిబ్బంది క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి వేతన దారునికి రోజుకు రూ.257 చెల్లించే విధంగా పని కల్పించాలన్నారు. హౌసింగ్ కింద మంజూరైన లబ్ధిదారులు స్టేజీల వారీగా 90 రోజుల పని దినాలు వేయాలని సూచించారు. మార్చి నాటికి ప్రతి కుటుంబం 100 రోజులు పూర్తి చేసుకొనే విధంగా పనులు కల్పించాలని ఆదేశించారు. దేవనకొండ, పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, ఆస్పరి, కోడుమూరు ఉపాధి సిబ్బంది, ఎపిఒలు, ఇసిలు, టిఎలు, సిఒలు, ఎఫ్ఎలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ జలకలతో రైతుల అభివృద్ధి

- మంత్రి గుమ్మనూరు సోదరులు

ప్రజాశక్తి - దేవనకొండ

జలకళ కార్యక్రమంలో పాల్గొన్న గుమ్మనూరు సోదరులు

వైఎస్ఆర్ ఉచిత జలకళ పథకం ద్వారా వైసిపి ప్రభుత్వం రైతుల అభివృద్ధికి కృషి చేస్తోందని రాష్ట్ర ఉపాధి, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండలంలోని కరివేముల గ్రామంలో వైఎస్ఆర్ ఉచిత జలకళ పథకాన్ని తెలుగు అంజనేయ అనే రైతు పొలంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం గత మూడేళ్లుగా పంటల బీమా అందించిందని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రాయితీ ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించి రైతులకు ట్రాక్టర్లు పంపిణీ చేస్తోందని చెప్పారు. రైతుల అభివృద్ధి వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఏపీడీ పద్మావతి, ఎంపిడిఒ గౌరీ దేవి, ఎపిఒ కృష్ణమూర్తి, జడ్‌పిటిసి కిట్టు, వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, వైసిపి నాయకులు నిజాలు రెడ్డి, మోహన్ రెడ్డి, దివాకర్ నాయుడు, ఎల్‌కె.శీను, వీరేష్, తెలుగు శీను, తిక్కయ్య, మదన్ మోహన్ రెడ్డి, రామచంద్ర, రాజన్న, చంద్రన్న, గుండు రంగస్వామి, ఆంజనేయులు పాల్గొన్నారు.

చిన్నారి సౌజన్య మృతి బాధాకరం

- పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అయ్యస్వామి

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కరివేముల గ్రామంలో వలస వెళ్లిన కుటుంబంలో పాము కాటుకు గురై చిన్నారి చాకలి సౌజన్య మృతి చెందడం బాధాకరమని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అయ్యస్వామి, డిఎస్‌యు జిల్లా కార్యదర్శి శరత్ తెలిపారు. శుక్రవారం చిన్నారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. డిఎస్‌యు మండల నాయకులు బాబు, రాజు, పెద్దయ్య ఉన్నారు.

ప్రశ్నించే గొంతుకలైన...

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

- ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-ఆలూరు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌస్ దేశాయ్

సమస్యలపై ప్రజా గొంతుకలుగా ప్రశ్నించే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.గౌస్ దేశాయ్, వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ కోరారు. శుక్రవారం ఆలూరులోని జ్యోతిబసు భవన్‌లో ప్రజాసంఘాల సమావేశం నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి షాకీర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకున్న వారందరికీ అభినందనలు తెలిపారు. ఉన్నత విద్యావంతులు, సామాజిక స్పృహ కలిగిన వ్యక్తులు, నిత్యం ప్రజా ఉద్యమాల్లో ఉంటూ, ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తున్న ఉద్యమ అభ్యర్థులైన పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. గత మూడున్నర ఏళ్లుగా విద్యారంగంలో అనేక సమస్యలు, సంక్షోభాలు ఎదురయ్యాయని తెలిపారు. యూనివర్సిటీలకు నిధులు, నియామకాలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. ఇక్కడున్న ఎమ్మెల్సీ అధికార పక్షం కావడంతో సమస్యలను పరిష్కరించే బాధ్యత అటుంచితే కనీసం సమస్యలను గుర్తించలేని స్థితిలో ఉన్నారని మండిపడ్డారు. గత ఐదేళ్లుగా రాయలసీమ సమస్యలపై చట్టసభల్లో కనీసం ఒక్కరోజు కూడా మాట్లాడలేదని తెలిపారు. అదే చట్టసభల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీగా గతంలో గేయానంద్ ఉన్నప్పుడు కడప ఉక్కు పరిశ్రమ, ప్రభుత్వాస్పత్రి వైద్యం గురించి, ప్రత్యేక హోదా కోసం, రాయలసీమ హక్కుల కోసం, సాగునీటి కోసం అనేకమైన పోరాటాలు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విలీనాన్ని తీసుకొస్తే కేవలం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే చట్టసభల్లో పోరాడారని తెలిపారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు పిడిఎఫ్ అభ్యర్థులుగా బరిలో దిగుతున్న పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డికి ప్రజాసంఘాలు మద్దతు తెలుపుతాయని అన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.హనుమంతు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఖాసీం పాల్గొన్నారు.

వాయు కాలుష్య నివారణకు చర్యలు

- మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో వాయు కాలుష్య నివారణకు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి రోడ్డులో మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహనాల వాడకం రోజురోజుకు పెరగడం వల్ల వాటి నుంచి వెలువడే పొగ వల్ల వాయు కాలుష్యం పెరిగిపోతోందని తెలిపారు. శ్వాస సంబంధమైన వ్యాధులు వచ్చే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో ఖాళీ స్థలాల్లో మొక్కలు పెంచి పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలని సూచించారు.

మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

రేషన్ పంపిణీలో మంచి పేరు తెచ్చుకోవాలి : ఆర్ఐ

తూకాలను తనిఖీ చేస్తున్న ఆర్ఐ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రభుత్వం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి అందించే రేషన్ పంపిణీలో లబ్ధిదారుల నుంచి మంచి పేరు తెచ్చుకోవాలని ఇన్‌ఛార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ కోరారు. శుక్రవారం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలోని మొబైల్ ట్రక్కు ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్ పంపిణీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తూనికలో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని తెలిపారు. తహశీల్దార్ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు తనిఖీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి ఫిర్యాదు అందినా వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీనియర్ అసిస్టెంట్ నూర్ అహ్మద్, విఆర్ఒలు భీమనగౌడు, భీమయ్య, పవన్ కుమార్ వర్మ, విఆర్ఎ నర్సయ్య పాల్గొన్నారు.

కొత్తగా ఓటరు కార్డు నమోదు చేసుకోండి : తహశీల్దార్

ప్రజాశక్తి-ఆలూరు

18 ఏళ్లు నిండిన యువత కొత్తగా ఓటరు కార్డు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ మల్లికార్జున తెలిపారు. శుక్రవారం ఆలూరులో శ్రీవెంకటేశ్వర, రాఘవేంద్ర ప్రయివేట్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 18 నుంచి 19 ఏళ్ల వయస్సు కలిగి ఉన్న వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్ఐ బసవన్న గౌడ్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ మల్లికార్జున

ఆస్పరి ట్రాన్స్‌కో ఎఇగా మల్లికార్జున

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి మండల ట్రాన్స్‌కో ఎఇగా ఎం.మల్లికార్జున శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆస్పరిలో విధులు నిర్వహిస్తున్న ముల్లా బాబా ఆజాద్ బదిలీ కావడంతో ఆదోనిలో డి3 సెక్షన్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లికార్జున ఆస్పరి ట్రాన్స్‌కో ఎఇగా ఇన్‌ఛార్జి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2011లో విధుల్లో చేరి ఆలూరు, చిప్పగిరి, హాలహర్వి, కౌతాళం, ఆదోని మండలాల్లో విధులు నిర్వహించినట్లు తెలిపారు. సిబ్బందితో కలిసి ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉంటామని చెప్పారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం సిబ్బంది మల్లికార్జునకు శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

జిల్లా ఫుట్‌బాల్ సీనియర్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి - ఆదోని

గత నాలుగు రోజులుగా పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా ఫుట్‌బాల్ సీనియర్స్ తుది జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా ఫుట్‌బాల్ కార్యదర్శి లక్ష్మికాంత్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం క్రీడాకారులకు వంశీ చైతన్య నర్సింగ్ హోమ్ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ యాదవ్ జెర్సీలను అందజేశారు. ఈ నెల 5 నుంచి 8 వరకూ వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - చిప్పగిరి

అన్నదానానికి వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ విరాళం అందజేశారు. శుక్రవారం హాలహర్వి మండలం కుక్కరచెడు గ్రామంలో భవాని మాల వేసుకున్న భక్తులందరూ గ్రామంలో అన్నదానం నిర్వహించేందుకు సహాయం చేయాలని నారాయణను కోరారు. ఆయన వెంటనే స్పందించి రూ.10 వేల విరాళం అందజేశారు. విరాళం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

విరాళం అందిస్తున్న వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

ప్రజాశక్తి- దేవనకొండ

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, పార్టీలకతీతంగా వైసిపి ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తోందని రాష్ట్ర ఉపాధి, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. శుక్రవారం మండలంలోని అలారుదిన్నె గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ముందుగా మంత్రి జయరాం గ్రామ సచివాలయాన్ని సందర్శించి, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. ప్రాధాన్యత భవనాలైన సచివాలయం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం నిర్మాణాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిర్ణీత గడువులోపు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల గడప వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని చెప్పారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రజలకు జవాబుదారీతనంతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలని తెలిపారు. అనంతరం మంత్రి ఇంటింటికి నేరుగా వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, వారి ఇంటికి చేకూరుస్తున్న లబ్ధి గురించి ప్రజలకు తెలియజేశారు. అర్హత ఉండి పథకాలు అందని వారుంటే, వారి వివరాలు సేకరించి పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, వాలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. గ్రామంలో పర్యటిస్తుండగా గ్రామస్తులు తాగునీరు, సిసి రోడ్లు, డ్రెయినేజీ సమస్య ఉందని మంత్రి దృష్టికి తీసుకు రాగా వెంటనే మంత్రి స్పందించి సిసి రోడ్డు, డ్రెయినేజీ కోసం అలారుదిన్నె గ్రామానికి రూ.15 లక్షలను మంజూరు చేశారు. వెంటనే ప్రణాళికలు సిద్ధం చేసి పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంత్రి సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణ స్వామి, ఎంపిడిఒ గౌరీ దేవి, ఎఒ సురేష్ బాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ మురళీమోహన్, జడ్‌పిటిసి కిట్టు, ఎంపిపి భర్త లుమాంబ, ఎంపిటిసి లక్ష్మీదేవి, సర్పంచి మల్లయ్య, వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, వైసిపి మండల నాయకులు ప్రభాకర్ రెడ్డి, నారాయణ రెడ్డి, నిజాలు రెడ్డి, దివాకర్ నాయుడు, మోహన్ రెడ్డి, ప్రేమ్ నాథ్ రెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, రాజన్న, రామచంద్ర, చంద్రన్న, నరసింహస్వామి పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం

In the Court of the Senior Civil Judge :: Adoni.
O.S.122/2016

Between:
Shree Vimalnath Corporation, by its Managing Partner Chandrakanth .P. Jain. ...Plaintiff
.VS.
R. Eeswaraiah [died] by L.Rs.& others. ...Defendants

SUMMONS

To
D4] R. Suvarna Devi,
w/o late R. Eeswaraiah, H.no.21-96,
near water tank, Kondapeta, Dhone.
Sir,

Please take notice that the above named plaintiff has filed the above suit for the recovery of the suit on the foot of hire purchase agreement against you and other and the above said matter is posted for your notice and appearance on 07-12-2022. You are hereby directed to appear before the above said court on the above said date at 10.30 a.m. either in person or through your counsel, else the matter will be decided by setting you ex-parte.

K. Abdul Rasheed,
D. Savitha Rani,
Advocates, Adoni.

నిమోనియా బాధితులు జాగ్రత్త వహించాలి

- డాక్టర్ ఉజ్జినయ్య

ప్రజాశక్తి - ఆదోని

నిమోనియా బాధితుల అనారోగ్యంపై చలికాలం ఎక్కువగా ప్రభావం చూపుతోందని, జాగ్రత్తలు పాటించాలని జ్యోతి చిన్నపిల్లల ఆస్పత్రి వైద్యులు ఉజ్జినయ్య సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. నిమోనియా వ్యాధిగ్రస్తులు చలిలో ఎక్కువగా తిరగరాదన్నారు. చిన్నారులు, వృద్ధులు చలికాలంలో ఎక్కువగా రుగ్మతలకు గురవుతారని తెలిపారు. చలిగాలికి ఎక్కువగా తిరగడం, తరచూ తల స్నానం చేయడం వల్ల నిమోనియా వచ్చే అవకాశం ఉందన్నారు. వ్యాధి లక్షణాలు ఆస్తమా, అలర్జీ, దగ్గు, ఆయాసం, గుండె దడ ఉంటుందన్నారు. ఈ లక్షణాలు ఉన్నవారు తప్పనిసరిగా వైద్యుని సలహాలు పాటించాలని తెలిపారు. నిర్లక్ష్యం చేస్తే ఊపిరితిత్తుల్లో గడ్డలు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల శ్వాసకు ఇబ్బంది ఏర్పడి ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఎక్కువగా చిన్నారులకు శ్వాసకోశ సంబంధ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, సకాలంలో వైద్యుని సంప్రదించాలని సూచించారు. తమ ఆస్పత్రిలో ఆక్సిజన్, హై ఫ్లూడ్, ఒటి సౌకర్యం, రేడియలజేషన్ సదుపాయం ఉందని తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని పి.కోటకొండ గ్రామంలో కర్ణాటక అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోటకొండకు చెందిన చెన్నకేశవులు, ముక్కెర వెంకటేశ్వర్లు, చిట్యాల తిప్పయ్య, క్రిష్ణగిరి మండలం ఆగవెలి ఎరుకల పెద్ద మద్దిలేటిలు కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఒరిజినల్ ఛాయిస్ టెట్రా 288 ప్యాకెట్లను అక్రమంగా విక్రయిస్తుండగా దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు చెప్పారు.

ప్రజా విశ్వాసం కోల్పోయిన జగన్

- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు - 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' ప్రారంభం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

చిప్పగిరిలో మాట్లాడుతున్న లాయర్ షేక్షావలీ

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ మూడేళ్ల పాలనలోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజా విశ్వాసం కోల్పోయారని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు ఎద్దేవా చేశారు. మండలంలోని దిబ్బనకల్లు గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో శుక్రవారం 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని ప్రారంభించారు. మీనాక్షి నాయుడు ప్రజల ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకొని వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో టిడిపి అధికారంలోకి వస్తుందని, ప్రజల కోసం పని చేసే పార్టీ టిడిపి అని తెలిపారు. నాయకులు అప్సర బాష, బుద్దారెడ్డి, లక్ష్మినారాయణ, తిమ్మప్ప, శేషా రెడ్డి, ఈరన్న యాదవ్, రామకృష్ణ, రంగస్వామి నాయుడు, లక్ష్మన్న, వలమన్న, అయ్యన్న, మాజీ కౌన్సిలర్ రంగన్న, మాబాష, రామాంజి, వీరేష్, షణ్ముఖ, కిష్టప్ప, కృష్ణారెడ్డి పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలంలోని రామదుర్గం, నగరడోన, నేమకల్లు గ్రామాల్లో 'ఇదేమి ఖర్మ'ను టిడిపి కన్వీనర్ లాయర్ షేక్షావలీ, జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ హాజరయ్యారు. మాజీ కన్వీనర్ కిష్టప్ప, మాజీ వైస్ ఎంపిపి వెంకటేశులు, సర్పంచులు పురుషోత్తం, సావిత్రి, సుశీలమ్మ, టిడిపి సీనియర్ నాయకులు తిమ్మయ్య, సన్నప్ప, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు, మాజీ ఎంపిటిసి భాస్కర్, పులికొండ, చంద్ర, ఉమాకాంత్ స్వామి, నరసింహులు పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలోని ఎరిగేరి గ్రామంలో 'ఇదేం..ఖర్మ'ను ప్రారంభించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జీ, టిడిపి జిల్లా రైతు కార్యదర్శి వెంకటపతి రాజులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాజానందు, వీరేష్, రామాంజి, బసవరాజు, దొడ్డన గౌడ్, రహిమాన్, మంజు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు (రూరల్)** మండలంలోని సొగనూరు గ్రామంలో 'ఇదేం ఖర్మ నిర్వహించారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి జెండాను ఆవిష్కరించారు. మండల నాయకులు జగదీష్, సర్వేశ్వర్ పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న బీవీ

కౌతాళంలో మాట్లాడుతున్న నాయకులు

గంట ముందు పిడిఎఫ్ ప్రశ్నాపత్రాలు

- ఉపాధ్యాయులకు తప్పని తిప్పలు

- బోర్డుపై రాసిన ప్రశ్నలు రాసుకోలేక విద్యార్థుల అవస్థలు

- రాష్ట్ర విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్ర విద్యాశాఖ అనాలోచిత నిర్ణయాల వల్ల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ప్రభుత్వం ద్వారా విద్యా శాఖ నిర్వహించే ఫార్మాటివ్-2 పరీక్షలకు చెందిన తెలుగు, లెక్కల ప్రశ్నాపత్రాలను గంట ముందుగా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలకు పిడిఎఫ్ ఫైల్‌ను శుక్రవారం వ్యాట్సప్ ద్వారా పంపించారు. ఉపాధ్యాయులు దానిని జిరాక్స్ సెంటర్లకు వెళ్లి జిరాక్స్ చేయించి ఆ ప్రశ్నలను బోర్డుపై రాశారు. వాటిని చూసి పేపర్‌లో రాసుకోవడం, వెంటనే విద్యార్థులు సమాధానాలు రాయడం అంతా హడావుడిగా జరిగింది. ఈ విషయంపై స్థానిక శ్రీవైష్ణవి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ ఎస్.రాఘవేంద్రను వివరణ కోరగా... ప్రశ్నాపత్రాల కోసం తమ పాఠశాల నుంచి ప్రభుత్వానికి రూ.80 వేలు చెల్లించామని తెలిపారు. వారు పేపర్లు లీకేజీ అవుతాయని భావించి ఇలా పిడిఎఫ్ ఫైల్ ద్వారా గంట ముందు పంపిస్తున్నారని చెప్పారు. దీనివల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాఠశాలలో ఉన్న 6 నుంచి 10వ తరగతి వరకు తెలుగు సబ్జెక్టు బోధించే ఉపాధ్యక్షులు ఒకరే ఉంటారని, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నా సెక్షన్ల వారీగా ఉంటారని చెప్పారు. అప్పుడు ఒకే ఉపాధ్యాయుడు ఆ 5 తరగతుల ప్రశ్నాపత్రాలు గంటలో బోర్డులో ఎక్కించడం అంత సులువైన పని కాదని పేర్కొన్నారు. ఇది అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులకు ఎదురవుతున్న సమస్యలు అని తెలిపారు. ఈ విధంగా 1 నుంచి 5వ తరగతి వరకు లెక్కల పరీక్షలు, 6 నుంచి 10వ తరగతి వరకు తెలుగు పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టి సారించాలని కోరారు.

బోర్డుపై ప్రశ్నలను రాస్తున్న ఉపాధ్యాయులు

ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారంలో వైసిపి విఫలం : టిడిపి

ప్రజాశక్తి-కోసిగి రూరల్

ప్రజా సమస్యల పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం మండలంలోని కోల్మన్ పేట గ్రామంలో 'ఇదేం.. ఖర్మ' నిర్వహించారు. మండల కన్వీనర్ జి.జ్ఞానేశ్ అధ్యక్షత వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలు పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డిని ప్రజలు పలుకరిస్తూ వైసిపి ప్రభుత్వం మోసం చేసిందని, అభివృద్ధి చేసిందేమీ లేదని వివరించారు. ఐటిడిపి అధ్యక్షులు సల్మాన్, రాజు, మదిరే వీరారెడ్డి, పెద్ద రామయ్య, లక్ష్మయ్య, హుస్సేని పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్ ప్రకటించాలి

- డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల నుంచి ఊరిస్తున్న ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్‌ను ప్రకటించాలని, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు అడహక్ ప్లేస్‌మెంట్స్ ఇవ్వాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) రాష్ట్ర కార్యదర్శి గోట్ల చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షులు కరె కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం డిటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మిగనూరు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా చిన్న వీరేష్, ప్రధాన కార్యదర్శిగా సాయిబాబు, ఉపాధ్యక్షులుగా సోమశేఖర్, రంగస్వామి, మాలతి, కవిత, కార్యదర్శులుగా జగదీష్, హసన్, కృష్ణవేణి, రూపవతి, సబియా సుల్తానా, మారుతి, రూతమ్మ, జిల్లా కౌన్సిలర్లుగా కరె కృష్ణ, చంద్రశేఖర్ యాదవ్, వీరన్న, ఖాజాబాషా, నాగన్న, జయానంద్, మధుసూదన్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డిని ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాముడు, జిల్లా కార్యదర్శి రామన్న, డిటిఎఫ్ బాధ్యులు పాటిల్ ఈశ్వర్ రెడ్డి, రవీంద్ర, జయరాజు, వెంకటేశప్ప పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆలూరు
O.S.No. 17/2021

Between :
M. చంద్రశేన ... వాది
Vs
R. రంగనగౌడ్, ... ప్రతివాది

To
R. రంగనగౌడ్, S/o. R. సంగనగౌడ్, హిందు
సిరిగాపురం గ్రామము, హాలహర్వి మండలము,
కర్నూలు జిల్లా.

పైన పేరొన్న కేసులో వాది ప్రతివాది మీద కేసు దాఖలు చేసియున్నాడు. కావున ప్రతివాది 05-01-2023వ తేదీన వకీలు ద్వారా గాని, స్వయంగాకాని హాజరు కావలెనని కోరడమైనది.

By Order
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది : 05/01/2023

K. SREEDHAR, B.A., LLB
Advocate,
Adoni - 518301. (A.P.)
Cell No. 8985701165,
9705841725

IN THE COURT OF THE VI th ADDITIONAL DISTRICT JUDGE- CUM-MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL: GOOTY.
M.V.O.P.No.39/2022

Between:
1.Golla Krishnaveni, 2.Kunchi Prasanthi,
3.Golla Mallikarjuna Naidu, 4.Bayeneni Swathi
Shail Nazeer Ahamed ... **Petitioners**

AND

1.Sudharshan Naidu, (Driver of the Crime Vehicle bearing No.KA-01-AC-8818)
...**Respondents**

To
R1:Sudharshan Naidu, S/o Janardhan, Hindu, Aged 25 years, H.No.7/69, Sunkulamma Street, Alamuru Village, Panyam Mandal, Kurnool District. (Driver of the Crime Vehicle bearing No.KA-01-AC-8818)

నోటీసు

01-10-2021 తేదిలో జరిగిన రోడ్డు ప్రమాదములో గొల్ల మోహన కృష్ణయ్య నాయుడు చనిపోయినందు, అతని చావు కొరకు పరిహారము రాబట్టు నిమిత్తం, అతని వారసులైన అర్జిదారులు కోర్టులో దావా వేసినారు. పై దావాలో కోర్టులో నీ హాజరు నిమిత్తం 13/12/2022 తేదీలో ఉదయం 10:30 ని.నీవు, నీ తరుపు న్యాయవాది ద్వారా కానీ కోర్టులో హాజరై నీ సమాధానము తెలుపుకొనుటకు వాయిదా ఉన్నది. 13/12/2022 తేదిలో నీవు కానీ, నీ తరుపు న్యాయవాది కాని కోర్టులో హాజరు కాక, ఎలాంటి సమాధానము తెలుపుకొనని యెడల కోర్టువారు నీ పరోక్షమందు తీర్మానము చేయుదురని యిందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
కె.మనోహర్ బాబు,
వాదిపరం వకీలు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

అంతా అయోమయం..!

- నర్స్ పోస్టుల భర్తీకి రివైజ్డ్ నోటిఫికేషన్ - డిడి పేరు మార్చడంతో ఇబ్బందులు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖలోని స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీలో అయోమయం ఏర్పడింది. రివైజ్డ్ నోటిఫికేషన్ విడుదల చేయడం, అందులో డిడి తీయాల్సిన పేరు మార్చడంతో అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖలోని స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి నాలుగు రోజుల కిందట నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 461 పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 6 వరకు రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించారు. దరఖాస్తు రుసుం ఓసి, బిసి అభ్యర్థులు రూ.500, ఎస్సీ, ఎస్టీ, వికలాంగ అభ్యర్థులు రూ.300 డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ పేరుతో డిడి తీసి సమర్పించాల్సి ఉంది. అయితే గురువారం సవరించిన (రివైజ్డ్) నోటిఫికేషన్ విడుదల చేశారు. పోస్టుల సంఖ్యను 1404కు పెంచారు. దరఖాస్తుల సమర్పణకు ఈ నెల 8 వరకు గడువు పెంచారు. కానీ డిడి తీయాల్సిన చిరునామాను ఆయా జోన్ల రీజనల్ డైరెక్టర్‌గా మార్చారు. దీంతో అప్పటికే డిడి తీసిన అభ్యర్థులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. మళ్లీ కొత్త డిడి తీయాలా అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలువురు అధికారులను వివరణ కోరగా కొత్త చిరునామాతోనే డిడి ఉండాలని, గతంలో డిడి తీసిన బ్యాంకుకు వెళ్తే చిరునామా మార్చి ఇస్తారని సూచించారు. అది తెలియని చాలా మంది అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దాంతో పాటు దరఖాస్తులను రీజనల్ కార్యాలయాల్లో సమర్పించాలని ఉండటంతో కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన అభ్యర్థులు కూడా కడపకు వెళ్లి దరఖాస్తు ఇవ్వాల్సి వస్తోంది.

రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో

7లోగా భూ హక్కు పత్రాల పంపిణీ చేయండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఈనెల 7వ తేదీలోగా భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ సంబంధిత మండల తాసిల్దార్లు, ఆర్డీఓలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 2023 ఓటర్ల జాబితా, మ్యుటేషన్ దరఖాస్తులు, పిఓఎల్ఆర్ రీసర్వే, జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూరక్ష పథకం, స్పందన అర్జీలు, పౌర సరఫరాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం, భూసేకరణ, 90 రోజుల ఇళ్ల పట్టాలు తదితర రెవెన్యూ అంశాలపై అన్ని మండలాల తాసిల్దారులు, ఆర్డీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చుక్కల భూములకు సంబంధించి 3912 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, రెండు రోజుల్లో క్లియర్ చేసి ఆర్డీవోల ద్వారా పంపాలని ఆదేశించారు. 90 రోజుల ఇళ్ల పట్టాలకు సంబంధించి భూసేకరణ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. 2023 ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం ద్వారా యువ ఓటర్ల నమోదుకు సంబంధించి ఫారం 6 దరఖాస్తులు స్వీకరించాలన్నారు. సమావేశంలో డిఆర్ఓ పుల్లయ్య, డోన్, ఆత్మకూరు ఆర్డీవోలు వెంకటరెడ్డి, యం.దాసు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలే ధ్యేయం

- గ్రామ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించండి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ప్రామాణికంగా తీసుకొని ప్రతి గ్రామపంచాయతీలో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు సంపూర్ణ శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ మాస్టర్ ట్రైనర్లకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2023-24వ సంవత్సరానికి తయారు చేయడానికి రెండు రోజుల టిఒటి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యావసరలైనా నీటి సరఫరా, పారిశుధ్యం, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, ఆరోగ్యం, విద్య, తదితర కీలకమైన సేవలను దృష్టిలో ఉంచుకొని 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించే దిశలో గ్రామపంచాయతీలు అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని మాస్టర్ ట్రైనర్లకు సూచించారు. గ్రామ ప్రణాళిక ద్వారానే మండల, జిల్లా అభివృద్ధి ఆధారపడి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామాల్లోనే 60 నుంచి 70 శాతం వరకు జనాభా నివాసం ఉంటున్నారని, అభివృద్ధి అనేది గ్రామాల నుండే ప్రారంభం కావాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు ఇచ్చిన హామీలను కూడా పరిగణలోకి తీసుకొని వారి సహకారం తీసుకొని ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ గ్రామాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే అందుకు తగ్గ ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టి సాధించే దిశలో అధికారులు కృషి చేయాలన్నారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది పక్కా ప్రణాళిక రూపొందించి ఆ మేరకు గ్రామాలను అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ సుబ్బారెడ్డి, డిఆర్డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, డ్వామా పిడి రామచంద్రారెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ రామ్మోహన్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి లీలావతి, డీఎంహెచ్వో డాక్టర్ వెంకటరమణ, డీఈవో అనురాధ, డిపిఒ శ్రీనివాసులు తదితరులు సంబంధిత అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రతి మండలం నుండి ఎంపీడీవో, ఈవోఆర్డీ, పంచాయతీ సెక్రటరీ, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా

పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చిన దళితులకు భూములు చూపాలి : ప్రజా సంఘాలు

ప్రజాశక్తి - ఆత్మకూర్

మిడుతూరు మండల కేంద్రంలో పట్టా పుస్తకాలు ఇచ్చిన 40 మంది దళితులకు, ఆరుగురు బిసిలకు వెంటనే పొలాలు చూపాలని వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్, ఎమ్మార్పీఎస్ నాయకులు దుర్గయ్యలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆత్మకూరు ఆర్డీవో దాసుకు వారు మిడుతూరు గ్రామస్తులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1996లో మిడుతూరు మండల కేంద్రంలోని 40 దళిత కుటుంబాలకు, బిసి 6 కుటుంబాలకు నాటి ప్రభుత్వం అలగనూరు పొలిమేరలో పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చారని, వాటి ద్వారా ప్రతి సంవత్సరం బ్యాంకులో ఆ భూములపై క్రాప్‌లోన్ తెచ్చుకుంటున్నారని, ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు కూడా సబ్సిడీ ద్వారా అందిస్తుందని తెలిపారు. కానీ ఇంతవరకు పేదలకు భూములు చూపలేదన్నారు. పట్టాలు ఇచ్చిన పాస్ పుస్తకాలకు భూములు చూపించాలని రెవెన్యూ అధికారులకు ప్రతి సంవత్సరం దరఖాస్తులు పెట్టుకున్నా స్పందన లేదన్నారు. భూములు చూపించాలని గత మూడు నెలల నుంచి సిపిఎం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సందర్భంగా రెవెన్యూ అధికారులు సర్వే చేసి రిపోర్టు ఇస్తామని నేడు తహశీల్దారు పేదలకు ఇచ్చిన పట్టా పాస్ పుస్తకాలు తమ ఆఫీసు నుంచి అందించలేదని, ఆ భూమిలో ఇతరులు సాగులో ఉన్నారని తప్పుడు రిపోర్టును కలెక్టర్‌కు పంపారని చెప్పారు. తప్పుడు రిపోర్టుపై రీ సర్వే చేయాలని ఆర్డీవోను కోరామన్నారు. నిజంగా పేదలకు ఇచ్చిన పట్టా పాస్ పుస్తకాలు నకిలివి అయితే రెవిన్యూ అధికారులపై చట్ట ప్రకారం కేసు పెట్టి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇచ్చిన పట్టా పాసుపుస్తకాల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు పి.వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు టి ఓబులేష్, ఎంఆర్‌పిఎస్ నాయకులు ప్రభాకర్, మిడుతూరు గ్రామస్తులు సుజ్ఞానం, తిరుపాలు, చెన్నమ్మ, దేవమ్మ, సుంకన్న, తిరుపతయ్య, ఏసన్న, మద్దమ్మ, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - సిరివెళ్ల

సిరివెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆర్. వెంకటరమణ శుక్రవారం సందర్శించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ఫార్మసీ ల్యాబ్‌లను పరిశీలించారు. లెప్రసీ సర్వే, మీజిల్స్ రుబెల్లా కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఆస్పత్రిని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ప్రైవేట్ హాస్పిటల్స్‌ను విజిట్ చేశారు. వైద్యాధికారి డాక్టర్ దివ్య, డెమో రవీంద్ర నాయక్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ

పలకరింపులతో ఆర్థిక మంత్రి పర్యటన

- డోన్ 2, 3,17 వార్డులలో కాలినడక
- బిసి బాలికల రెసిడెన్సియల్ స్కూల్, రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-డోన్

ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్ మున్సిపాలిటీ పరిధిలోని 2, 3, 17 వార్డులలో కాలినడకన కలియతిరిగి ప్రజలను పలుకరిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆర్థిక శాఖ మంత్రి బిసి బాలికల రెసిడెన్షియల్ స్కూల్, అమ్మ హోటల్ నుంచి నేషనల్ హైవే వరకు పాదయాత్ర చేశారు. మంత్రికి డోన్‌లో అడుగడుగునా జనం నీరాజనం పలికారు. నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పూలమాలలతో, శాలువాలతో సన్మానించి స్వాగతం పలికారు. 2,3,17 వార్డులలో ప్రజలను పలుకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బిసి బాలికల రెసిడెన్సియల్ స్కూల్, అమ్మ హోటల్ నుంచి నేషనల్ హైవేవరకు నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రిని కౌన్సిలర్ దినేష్‌గౌడ్ తదితరులు గజమాలతో, శాలువాలతో సన్మానించారు. మంత్రి వెంట రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్, కో ఆప్షన్ సభ్యులు వైఎస్ఆర్‌రఫీ, కౌన్సిలర్ దినేష్ గౌడ్, మల్లికార్జున, సాదిక్ పాల్గొన్నారు.

పాదయాత్ర చేస్తున్న బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

చోరీకి పాల్పడుతూ సిసి కెమెరాలో రికార్డు అయిన దృశ్యం

పాణ్యంలో దొంగల హల్‌చల్

ప్రజాశక్తి - పాణ్యం

పాణ్యంలోని బస్టాండ్ పరిసర ప్రాంతాలలో దొంగల అలజడి ఎక్కువై స్థానికులు బెంబేలెత్తి పోతున్నారు. అంగళ్ల షెట్టర్లు తీయడానికి ప్రయత్నించినట్లు సిసి కెమెరాల్లో రికార్డు కావడం చూసి షాప్‌ల యజమానులు ఆందోళన చెందుతున్నారు. గురువారం రాత్రి పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో కూల్‌డ్రింక్ షాప్ ఏజెన్సీలో దొంగతనం చేయడానికి ప్రయత్నం చేసి విఫలం అవడంతో వెనుతిరిగి పోయారు. ఆ దృశ్యాలన్నీ సిసి కెమెరాలలో నమోదు అయ్యాయి. అలాగే బస్టాండ్‌లోని లక్ష్మి మెడికల్ షాప్ తాళాన్ని పగుల గొట్టారు. రెండు నెలల క్రితం ఒక ఇంట్లోని మోటార్‌ను, నిర్మాణంలో వున్న ఇంటికి చెందిన ఇనుప కడ్డీలను ఎత్తుకెళ్లారు. వరుసగా సంఘటనలు జరగడం వల్ల ప్రజలు హడలిపోతున్నారు. ఎస్ఐ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి అంగడికి నిఘా నేత్రాలు అమర్చుకోవాలని చెప్పారు. ఎవరైనా కొత్త వ్యక్తులు, అపరిచిత వ్యక్తులు అనుమానస్పదంగా సంచరిస్తూ వుంటే పోలీస్ వారికి సమాచారం అందించాలని సూచించారు.

న్యాయ రాజధాని కర్నూలులో ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

న్యాయ రాజధానిని తక్షణమే కర్నూలులో ఏర్పాటు చేయాలని ఏపీ ఎన్జీవో పట్టణ అధ్యక్షులు టి.మణి శేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికకలెక్టరేట్ వద్ద మూడు రాజధానులు, న్యాయ రాజధాని తదితర అంశాలపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార వికేంద్రీకరణ చేయాలని, శ్రీబాగ్ ఒడంబడిక అమలు చేయాలని డిమాండ్ చేశారు. మూడు రాజధానులకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ మద్దతిస్తుందన్నారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంత అభివృద్ధికి కేంద్రం నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, కార్యదర్శులు బీసీ హుసేవరెడ్డి, నరసరెడ్డి ,శివ శంకర్ రెడ్డి, నాగరాజు, అలీ, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఏపీ ఎన్జీవో నాయకులు

మంత్రి బుగ్గనను రాజకీయంగా కూలుస్తాం

- వినూత్న రీతిలో టిడిపి 'ఇదేం కర్మ' కార్యక్రమం

ప్రజాశక్తి - డోన్

డోన్ నియోజకవర్గంలో మంత్రి బుగ్గన మాఫియా పాలన సాగిస్తూ ప్రజల నమ్మకం కోల్పోయారని, రాబోయే ఎన్నికలలో రాజకీయంగా ఆయనను ప్రజలు కూల్చివేయడం ఖాయమని టిడిపి డోన్ నియోజకవర్గ ఇన్చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక తారకరామ నగర్‌లో టిడిపి ఆధ్వర్యంలో 'ఇదేం కర్మ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి వెంకటాపురం చెరువు వరకు ధర్మవరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర నిర్వహించారు.జ గుంతల రోడ్లను చూపిస్తూ డోన్ ప్రజలకు ఇదేం కర్మ అంటూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. మంత్రి బుగ్గన గతుకుల రోడ్లపై పాదయాత్రలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి బుగ్గన చెరువులకు నీళ్లు నింపుతానని మూడున్నర సంవత్సరాల నుంచి చెబుతూనే వస్తున్నారని, కానీ చెరువులకు మాత్రం నీళ్లు రాలేదన్నారు. వర్షపు నీరు చెరువులో ఉంటే హంద్రీనీవా నీళ్లతో నింపినట్టు గ్రాఫిక్స్ చూపించడం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గంలో మంత్రి అండతోనే అనుచరులు భూదందాలు, ఇసుక, మద్యం, పేకాట, మట్కా మాఫియాలను నడిపిస్తూ అక్రమ సంపాదనలో మునిగి తేలుతున్నారని విమర్శించారు. ఇదే చివరి అవకాశమని మంత్రి బుగ్గనకు తెలిసి అనుచరులకు పర్మిషన్ ఇచ్చి దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో కోట్ల, కెఇ కుటుంబాలు ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. అనంతరం టిడిపి రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అరాచకాలు, విధ్వంసాలు జరుగుతుండడంతో అన్ని వర్గాల ప్రజలు ఇదేం కర్మ అంటూ బాధపడుతున్నారని, చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఎదురు చూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు సిఎం శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ ఆర్ఈ రాఘవేంద్ర, నియోజకవర్గ సలహాదారుల కమిటీ అధ్యక్షులు మురళీకృష్ణ గౌడ్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కుమ్మరి సుధాకర్, కౌన్సిలర్ సర్దార్ పాషా, గురుమూర్తి, పాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇదేం కర్మ కార్యక్రమంలో మాట్లాడుతున్న డోన్ నియోజకవర్గం టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి

ప్రారంభిస్తున్న వైసిపి బిసి జిల్లా కార్యదర్శి బోయ శంకరయ్య

ఎమ్మెల్యే కాటసానికి అమడాల సర్పంచి కృతజ్ఞతలు

కోవెలకుంట్ల : మండలంలోని అమడాల గ్రామంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో మెట్ట దగర బోరు వేయడంతో గ్రామ సర్పంచి బాల మద్దిలేటి, వైసిపి బిసి జిల్లా కార్యదర్శి బోయ శంకరయ్యలు శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి నాయకుడు సంఘం సుధాకర్ రెడ్డి, గ్రామ పెద్ద వెంకటేశ్ రెడ్డి, లాయర్ మధు సూదన్ రెడ్డి, భీమిరెడ్డి ప్రతాప్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ తొక్కల మనోహర్, జగదీశ్ రెడ్డి, మహేష్ రెడ్డి, మునిస్వామి రెడ్డి, పుల్లారెడ్డి, పంచాయతీ సెక్రటరీ అన్వర్, చెర్లపల్లే కంబగిరి, ఎర్రశాంత్, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్ముడు రిజర్వ్ అడిషనల్ ఎస్‌పిగా జి.చంద్రబాబు బాధ్యతలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో ఆర్ముడు రిజర్వ్ విభాగానికి (ఏఆర్) అడిషనల్ ఎస్పీగా జి.చంద్రబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డిని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. జి.చంద్రబాబు 1991 జులై 22న ఆర్ఎస్ఐ (ఏఆర్)గా గుంటూరు రేంజ్‌లో మొదటగా బాధ్యతలు స్వీకరించారు. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌లో ఏపి సిఎం నుంచి పీఎస్ఓగా, ఏపీ హెచ్ఎంగా సమర్థంగా విధులు నిర్వర్తించారు. అనంతరం ఎస్‌పిజి, డబ్ల్యుఅండ్‌టి, ఇండోర్, గ్రేహౌండ్స్ మొదలైన ప్రత్యేక శిక్షణలు పొందారు. ఆర్ఐ, డిఏఆర్, గుంటూరు, ఆర్ఐ అడ్మిన్, విఎస్‌పి సిటీలో పని చేశారు. డిఎస్‌పిగా పదోన్నతి పొందారు. విశాఖపట్నం జోన్ నుండి పదోన్నతి పొంది

జిల్లా ఎస్పీని కలిసిన ఆర్మ్డ్ రిజర్వ్ ఏఎస్పీ చంద్రబాబు

బాధితులకు అండగా ఉంటాం

- రూ. 10 వేలు నగదు అందజేసిన బైరెడ్డి

మిడుతూరు : మండలంలోని అలగనూరు గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలోని ముగ్గురు నవంబర్ 30న మధ్యాహ్నం కోడుమూరు దారిలో కారు టైరు పంచరై కల్వర్టును ఢీకొట్టడంతో మృతి చెందడం బాధాకరమని, బాధితులకు అండగా ఉంటానని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తెలిపారు. శుక్రవారం అలగనూరు గ్రామానికి ఆయన చేరుకుని బాధితుల కుటుంబాలను పరామర్శించారు. మంగలి లక్ష్మీదేవికి రూ.10 వేలు నగదును అందజేశారు. ఉన్న ఒక్క కూతురుకు నిశ్చితార్థం అయిందని గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి కృష్ణవేణమ్మ ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అమ్మాయి పెళ్లికి తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుండి రావాల్సిన వాటి గురించి ఎంపీడీవోతో ఫోన్లో మాట్లాడారు. ఆయన వెంట మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ నాగ తులసి రెడ్డి, వైస్ ఎంపీపీ నబి రసూల్, మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ హరి సర్వోత్తమ రెడ్డి, మల్లు శివ నాగిరెడ్డి, అలగనూరు నాయకులు పెద్దిరెడ్డి చిన్న రామచంద్రారెడ్డి, సుంకేసుల రాముడు, రాంభూపాల్ రెడ్డి, చింతలపల్లి మల్లేశ్వర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎన్. అనురాధ ఉన్నారు.

బాధితులను పరామర్శించేందుకు వస్తున్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

కారు, బైకు ఢీ - విలేకరికి తీవ్ర గాయాలు

చాగలమర్రి : చాగలమర్రిలోని 40వ జాతీయ రహదారిపై స్థానిక కూలూరు రస్తాలో ద్విచక్ర వాహనం, కారు ఢీ కొన్న ఘటనలో పాత్రికేయుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన విలేకరి చెన్న కేశవ స్థానిక కూలూరు రస్తాలో ద్విచక్ర వాహనంతో దాటుతుండగా హైదరాబాదు నుండి పొద్దుటూరుకు వెలుతున్న కారు ఢీకొంది. దీంతో విలేకరి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కారులోని వ్యక్తులు విలేకరిని స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకై ప్రొద్దుటూరుకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరు

- ప్రజాప్రతినిధులు మండి పాటు

ప్రజాశక్తి - ప్యాపిలి

మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి కొందరు అధికారులు గైర్హాజరు కావడంపై ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. శుక్రవారం ప్యాపిలి మండల కార్యాలయంలో ఎంపిడిఒ పజల్ రహిమాన్, ఇన్చార్జి తహసిల్దార్ మారుతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పిటిసి శ్రీరామ రెడ్డి, ఎంపిపి గోకుల్ లక్ష్మీ, వ్యవసాయ సలహా మండల చైర్మన్ మెట్టు వెంకటేశ్వర రెడ్డి, మాజీ జెడ్పీటిసి దిలీప్ చక్రవర్తి హాజరై మాట్లాడారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి కొందరు అధికారులు హాజరు కాకపోవడంపై వారిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మరొకసారి ఈవిధంగా జరిగితే వారిపై పైఅధికారులకు రిపోర్ట్ చేస్తామని హెచ్చరించారు. కలచట్ల గ్రామంలో అంగన్వాడీ కేంద్రం ముందు కొట్టం వేశారని అంగన్వాడి సూపర్వైజర్ దేవారూపమ్మ తెలిపారు. ఏనుగుమర్రి గ్రామంలో బీసీ కాలనీలో పైపులైను లేదని సర్పంచ్ మదన్మోహన్ తెలిపారు. పైపులు వచ్చాయని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఒ కళ్యాణి, ఏవో షేక్షావలి, ఏపిఓలు రమణ, నర్సిరెడ్డి, ఏఇ రవికుమార్, ఎంఇఓ శ్రీనివాసులు, పంచాయితీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శివకుమార్ గౌడ్, కార్యదర్శులు, సర్పంచులు పాల్గొనారు.

సర్వ సభ్య సమావేశంలో

న్యాయ సేవల పట్ల అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

న్యాయ సేవల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జి.అర్చన పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాలలోని బాల అకాడమీ పాఠశాలలో డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నుంచి లీగల్ విషయాలు, రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, స్లోగన్ రైటింగ్, చిత్రలేఖనం, క్విజ్ కాంపిటీషన్, డిబేట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జి.అర్చన హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆమెను పాఠశాల కరస్పాండెంట్ ఎంజివి.రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీ లతలు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

4న ఘంటసాల పాటల సంగీత కచేరి

ప్రజాశక్తి - నంద్యాల

అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు శతజయంతి సందర్భంగా ఈ నెల 4న ఆదివారం సాయంత్రం ఐదున్నర గంటలకు రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో ఘంటసాల పాటల సంగీత కచేరి కళారాధన సాంస్కృతిక సంస్థ, రామకృష్ణ విద్యాసంస్థలు, ఐఎంఎ, లయన్స్ క్లబ్, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. ప్రముఖ గాయకులు ప్రభాకర్, శివకుమార్, వేణు, సాయి రతన్, నాగ ప్రియాంక ఘంటసాల పాటల్ని పాడనున్నారు. ఘంటసాల గురించి డాక్టర్, సహదేవుడు, డాక్టర్ మధుసూదనరావు ప్రసంగిస్తారు. సంగీత ప్రియులు, ఘంటసాల అభిమానులు అందరూ ఆహ్వానితులేనని, శత జయంతి ఉత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేడు కేంద్ర పథకాల అమలుపై జర్నలిస్టులకు శిక్షణ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

భారత ప్రభుత్వం, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో నేడు శనివారం ఉదయం 10-30 గంటలకు రామకృష్ణ డిగ్రీ కాలేజీలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో వార్తా లాప్ జర్నలిస్టు మిత్రులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి పి. జయరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణా కార్యక్రమానికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు హాజరు కావాలని కోరారు.

రెండు బైకులు ఢీ- ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - కొత్తపల్లి

ప్రమాదానికి గురైన వ్యక్తి

మండలంలోని చిన్న గుమ్మడాపురం- ముసల మడుగు గ్రామాల మధ్య రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. ముసలమడుగు గ్రామానికి చెందిన హుస్సేన్ భాష ఆత్మకూరు నుంచి సొంత గ్రామానికి వస్తుండగా పెసరవాయి గ్రామానికి చెందిన ఉపేంద్ర నాగర్ కర్నూల్ నుంచి వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నారు. ఇద్దరికి గాయాలయ్యాయి. ఉపేంద్ర తలకు గాయమై అధికంగా రక్తం పోయింది. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించడంతో వారిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఉపేంద్ర పరిస్థితి విషమంగా ఉంది.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే ఆర్థర్

- 50 సచివాలయాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 50 కేజీల కేకు కటింగ్
- ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికిన సర్పంచి ఆవుల జయసుధ, ఆవుల నారాయణరెడ్డి

ప్రజాశక్తి - పాములపాడు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పేర్కొన్నారు. శుక్రవారం పాములపాడు మండలం బానకచర్ల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నందికొట్కూరు నియోజకవర్గంలో 50 సచివాలయాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బానకచర్ల సర్పంచ్ ఆవుల జయసుధ, కొమెన చైర్మన్ ఆవుల నారాయణరెడ్డిలు ఎమ్మెల్యేకు గజమాలవేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వం నుండి వచ్చిన పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి సిసి రోడ్లు, పక్కా గృహాలు మంజూరు చేయాలని తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఆయా శాఖల అధికారులకు సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం నూతన సిసి రోడ్డుకు ఎమ్మెల్యే ఆర్థర్, సర్పంచి ఆవుల జయసుధ భూమి పూజ చేశారు. అనంతరం 50 సచివాలయం పూర్తి చేసుకున్న సందర్భంగా సర్పంచి గృహంలో ఏర్పాటు చేసిన 50 కేజీల కేకును ఎమ్మెల్యే ఆర్థర్, సర్పంచ్ ఆవుల జయసుధ, ఆవుల వెంకటనారాయణ రెడ్డి, వైసిపి రాష్ట్ర నాయకులు చెరుకుచెర్ల రఘురామయ్య, మండల నాయకులు రామలింగేశ్వర్ రెడ్డి కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు 50 సచివాలయాలు పూర్తి చేసుకున్నామని, 50,568 కుటుంబాలను తిరిగి ప్రభుత్వం నుంచి చేరే పథకాలను వారికి వివరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ రత్న రాధిక, ఎంపిడిఒ నాగ శివ లీల, వైసిపి మండల నాయకులు వెంకటేశ్వరరావు, బాలీశ్వర్ రెడ్డి, రమణారెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ ముర్తుజా అలీ, నాయకులు అంబయ్య, ఉపేంద్ర, భీమ శేఖర్, రాజన్న, స్వామి దాసు, భాస్కర్, దానమయ్య, తిరుపతయ్య, సర్పంచులు మాణిక్యమ్మ, మౌలాలి, వరప్రసాద్, ఆయా మండలాల నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

విఆర్ఒపై చర్యలు తీసుకోవాలి : ప్రజాసంఘాలు

ప్రజాశక్తి - నందికొట్కూరు: జిల్లా కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు చేసి విధులకు హాజరుకాకుండా జీతాలు ఇవ్వాలని తహశీల్దారును బ్లాక్ మెయిల్ చేస్తున్న విఆర్ మౌళి భాషాపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి పకీర్ సాహెబ్, సిఐటియు నాయకులు ఎస్.ఉస్మాన్ భాష, మహిళా సంఘం మండల కార్యదర్శి నూర్జహాన్‌లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన ప్రజా సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. బ్రాహ్మణకొట్కూరు విఆర్ఒ మౌళి భాష విఆర్ఒ అసోసియేషన్ అధ్యక్షులుగా ఉంటూ ఒకే చోట 14 సంవత్సరాలు విధులు నిర్వహిస్తున్నందున జిల్లా కలెక్టర్ బిజినవేములకు బదిలీ చేశారన్నారు. బిజినవేములలో రెండు నెలలు విధులకు హాజరు కాకుండా తహశీల్దార్ రాజశేఖర్ బాబు తనకు రెండు నెలల జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో సమస్య మొదలైందన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా బ్రాహ్మణకొట్కూరుకు బదిలీపై వెళ్లిన వీఆర్వో నర్సరాజుకు బిజినవేములకు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారని చెప్పారు. మౌళిభాష తోటి విఆర్ఒలను తప్పుడుదోవ పట్టించి మూక్కుముడిగా జిల్లా కలెక్టర్‌కు తహశీల్దార్లపై ఫిర్యాదు చేయడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా మౌళి భాష తీరు మార్చుకొని కలెక్టర్ ఆదేశాల మేరకు బదిలీ అయిన స్థానంలో ప్రజలకు సేవలు అందించాలని కోరారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు వేణుగోపాల్, నాగరాజు, ముర్తుజావలి, ...

మాట్లాడుతున్న నాయకులు

పరిపాలన వికేంద్రీకరణ జరగాలి

- 5న సీమ గర్జనను విజయవంతం చేద్దాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి పరిపాలన వికేంద్రీకరణే ఏకైక మార్గమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని శోభ లాడ్జిలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా ఆధ్వర్యంలో వైసిపి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిపాలన వికేంద్రీకరణ జరగాలని, రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ ఈనెల 5న కర్నూలు ఎస్టీ బీసీ కళాశాల మైదానంలో జరిగే సీమ గర్జనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం పరిపాలన వికేంద్రీకరణపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, జడ్పిటిసి గోకుల్ కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు శెట్టి ప్రభాకర్, రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సిద్ధం శివరాం, మాజీ జెడ్పిటిసి ప్రహల్లాద రెడ్డి, రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** ఈ నెల 5న కర్నూల్ ఎస్టిబిసి కాలేజ్ గ్రౌండ్‌లో జరిగే రాయల సీమ సింహ గర్జనకు తరలిరావాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు కోరారు. కొలిమిగుండ్లలోని వైసిపి కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సాహసోపేత నిర్ణయానికి సంఘీభావం తెలపాలని బనగానపల్లె నియోజకవర్గ ప్రజలను కోరారు. వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువి రెడ్డి, సీనియర్ నాయకులు పేరం సత్యనారాయణరెడ్డి, గొర్విమానిపల్లె జగన్, మొలక రాజారెడ్డి, పులి ప్రకాష్ రెడ్డి, కోటపాడు ఈశ్వర్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కలవటాల తిమ్మారెడ్డి, నందిపాడు గురివిరెడ్డి, తుమ్మలపెంట మల్లేశ్వర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్

4న 'కెవి సుబ్బారెడ్డి'లో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ పట్టణంలోని కెవి సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈనెల 4వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా ఒకేసారి మూడు ప్రైవేట్ బ్యాంకులతో ఇంపాక్ట్ కంపెనీ వారి ఆధ్వర్యంలో ఐసిఐసిఐ, డిబిఎస్, హెచ్డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ బ్యాంకు వారు ఆన్‌రోల్ కోసం అసిస్టెంట్ ఆఫీసర్ ఇన్ సేల్స్, రిలేషన్షిప్ మేనేజర్, వివిధ రకాల పొజిషన్లకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. 30 సంవత్సరాల లోపు వయసు, డిగ్రీ, ఇంజనీరింగ్ చదువుతున్న, ఫాస్ అయిన విద్యార్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి ఆదర్శనీయమైన శాలరీతో పాటు బెనిఫిట్స్ ఉంటాయన్నారు. అర్హులైన వారు ఈ జాబ్ మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఇతర వివరాలకు 96767 58937, 86887 55219, 9542704025 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

వికలాంగుల సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వికలాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

వికలాంగుల పెన్షన్ రూ. 6 వేలకు పెంచాలని, వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, రెండు తెలుగు రాష్ట్రాలలో తొలగించిన 90 వేల వికలాంగుల పెన్షన్లను వెంటనే పునరుద్ధరించాలని ఎంఆర్పిఎస్ నాయకులు వెంకట సుబ్బన్న మాదిగ, వికలాంగుల సంఘం నాయకులు శీలారెడ్డి, ఈశ్వరయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వికలాంగుల సమస్యలపై శుక్రవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, విహెచ్పిఎస్, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట వికలాంగులతో కలిసి ధర్నా నిర్వహించారు. తహశీల్దార్ ఉమారాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో వికలాంగుల సంఘం నాయకులు రాముడు, రమిజాబీ, శాంతమ్మ, అంథోని, వెంకటేశ్వర్లు, వికలాంగులు పాల్గొన్నారు.

బోయ రాంపుల్లయ్యను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని చందలూరు గ్రామంలో మాల కులానికి చెందిన గుండమల్లె పెద్ద సంజన్నను హత్య చేసిన బోయ రాంపుల్లయ్యను కఠినంగా శిక్షించాలని మాల మహాసేన రాష్ట్ర అధ్యక్షులు కడియం సాంబశివుడు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయ రామ పుల్లయ్యకు బెయిల్ రాకుండా, రౌడీషీట్ తెరిచి కఠినంగా శిక్షించి జిల్లా బహిష్కరణ చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులలో స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా వెంటనే అరెస్టు చేయాలన్నారు. అనంతరం తహసిల్దార్ వెంకట శివకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర దళిత మహిళా సేన అధ్యక్షురాలు రోజక్క, మండల నాయకులు గాలి పోతుల వెంకటేశ్వర్లు, గుర్రం ప్రభాకర్, సాత్వి రాజు, తోకల వెంకటేశ్వర్లు, నల్లమల ఓబులేసు, బాలరాజు, ఆది లచ్చుమ్మ, కాంతయ్య, కనుమల కాలువ రాజు, గుండుమల్ల రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' పోస్టరు విడుదల

జూపాడుబంగ్లా : మండలంలోని పోతులపాడు గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు మండ్ర శివానందరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డి ఆదేశాల మేరకు 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి..' పోస్టర్లు టిడిపి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ రవికాంత్ ఆధ్వర్యంలో మండల కన్వీనర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, నందికొట్కూరు నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, తత్తూరు రమణారెడ్డి, లింగాపురం వేణుగోపాల్ రెడ్డి, శివరామిరెడ్డి, సంపత్ యాదవ్, డీసీ గిరి, పిక్కిలి శ్రీనివాసులు, ఉసనేయ్య గౌడ్, రవికుమార్ యాదవ్, తెలుగు యువత , వీరారెడ్డి, శాలు తదితరులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ 'ఇదేం ఖర్మ' కార్యక్రమంలో అనుసరించాల్సిన అంశాల గురించి వివరించారు. ప్రజల చేత 9261292612 నెంబరుకు మిస్డ్ కాల్ ఇప్పించి మన పోరాటంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు.

పోస్టర్ విడుదల చేస్తున్న టిడిపి నాయకులు

దాతల నుంచి నగదు విరాళం అందుకుంటున్న నిర్వాహకులు

వెంకటేశ్వర స్వామి ఆలయానికి విరాళం

రుద్రవరం : రుద్రవరం సమీపంలో వెలసిన వాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు రూ.50 వేలు నగదు విరాళం శుక్రవారం అందజేశారు. హైదరాబాదుకు చెందిన గుంజపల్లె జగదీశ్వర రెడ్డి, ఆయన సతీమణి సౌజన్య రెడ్డిలు ముందుగా స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం విరాళాన్ని ఆలయ నిర్వాహకులు సింగతల మధుసూదన్ రెడ్డి, లింగం వెంకట రంగనాయకులు శెట్టి, ఈడిగ కానాల వెంకట నరసింహులు, ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి గోపి శర్మ, డీజిల్ రమణలకు నగదును అందజేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

తెలుగు గంగ కాలువలో పడి ఎలుగుబంటి మృతి

పాములపాడు : మండలంలోని బానకచెర్ల గ్రామ సమీపంలో ఉన్న తెలుగు గంగ(టిజిపి) కాలవలో పడి ఎలుగుబంటి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఫారెస్ట్ రేంజర్ శ్రీకాంత్ నాయుడు మాట్లాడుతూ టిజిపి కాలువలో ఎలుగుబంటి పడి మృతి చెంది కొట్టుకొచ్చినట్లు తెలిపారు. ఎలుగుబంటి గత నాలుగైదు రోజుల కిందటే కాలువలో పడి ఉండొచ్చన్నారు. ఎలుగుబంటి మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిర్వహించి పంచనామా పూర్తి చేసినట్లు తెలిపారు

అయ్యప్పమాలధారులకు అబ్దుల్ మాలిక్ బిక్ష

బనగానపల్లె రూరల్ : స్థానిక ఆంజనేయ స్వామి గుడిలో అయ్యప్ప మాలధారులకు సబ్ ఇంటెలిజెన్సీ హెడ్ కానిస్టేబుల్ అబ్దుల్ మాలిక్ దంపతులు శుక్రవారం బిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 14 సంవత్సరాల నుండి తన శక్తిమేరకు బిక్ష ఏర్పాటు చేస్తున్నామనితెలిపారు. మతాలు వేరైనా సమానంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో గురుస్వామి సుబ్బారెడ్డి, అయ్యప్ప స్వాములు, కిషోర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

నాపరాయి మైనింగ్ యజమానులు, కార్మికుల సమస్యలపై దీక్ష చేపడతాం

- మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి

కొలిమిగుండ్ల : నాపరాయి మైనింగ్ యజమానులు, కార్మికుల సమస్యలపై ప్రస్తుత వైసిపి ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా దీక్ష చేయాలని నిర్ణయించుకున్నట్లు మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కొలిమిగుండ్లలోని టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని బందార్లపల్లె క్రాస్ రోడ్ వద్ద నాపరాయి మైనింగ్ యజమానులు, కార్మికుల సమస్యలపై దీక్షకు శుక్రవారం చేపట్టేందుకు పోలీసుల అనుమతి కోరగా వారు స్పందిస్తూ, వేరే తేదీలో దీక్ష చేసుకోవాల్సిందిగా సూచించారన్నారు. ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తూ త్వరలోనే తదుపరి తేదిని ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామేశ్వర రెడ్డి, నంద్యాల రామేశ్వర్ రెడ్డి, విఆర్ లక్ష్మిరెడ్డి, జయలక్ష్మి రెడ్డి, కేశవ కళ్యాణ్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, హుస్సేన్ రెడ్డి, మండల యువత అధ్యక్షుడు గొంగటి హుసేన్ రెడ్డి, నాయకులు, గనుల యజమానులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి : వ్యకాసం

ప్రజాశక్తి - ఆత్మకూర్

వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.సాములు, ఎం.నరసింహ నాయక్‌లు కోరారు. శుక్రవారం స్థానిక సుదర్శ వర్మ భవనంలో మహాసభ గోడ పత్రికలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నూటికి 80 శాతం ఉపాధి కూలీలు గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నారని, వారికి రోజువారి వేతనం 600 రూపాయలు ఇవ్వాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రెండు వందల రోజులు పని దినాలు కల్పించాలన్నారు. భూమిలేని ప్రతి నిరుపేదకు రెండు ఎకరాల భూమిని పంచాలన్నారు. చదువుకున్న విద్యార్థులకు నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జి సాములు, సహాయ కార్యదర్శి పుల్లన్న, శ్రీను నాయక్, లింగమ్మ, ఈదమ్మ, చిన్నమ్మ, వీరమ్మ, వెంకటాపురం భాష, చెవిటన్న, మూగన్న తదితరులు పాల్గొన్నారు. **మహానంది :** వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల నాయకులు కోరారు. గాజులపల్లి గ్రామంలో మహా సభ గోడ పత్రికలను నాయకులు కోటకొండ భాష ఆవిష్కరించారు. మద్దిలేటి, రమణ, నాగరాజు, నాగార్జున, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభ పోస్టులను విడుదల చేస్తున్న నాయకులు

సాగులో ఉండే రైతులకే పట్టాలు

- దళారుల మాటలు నమ్మవద్దు : ఎమ్మెల్యే
- జగనన్న ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు : జిల్లా పరిషత్ చైర్మన్

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

గ్రామాల్లో అసైన్‌మెంట్ ల్యాండ్ ఇప్పిస్తామని కొంతమంది దళారులు ప్రజలను మభ్య పెడుతున్నారని, అది తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వదంతులను ఎవరూ నమ్మవద్దని, రైతులు సాగులో ఉంటే వాటికి పట్టాలు ఇచ్చే కార్యక్రమం ఉంటుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. శుక్రవారం కొలిమిగుండ్ల మండల పరిషత్ అధ్యక్షురాలు కారపాకుల నాగ వేణి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు హాజరయ్యారు. మండలంలోని జరుగుతున్న పలు అభివృద్ధి పనులతో పాటు సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ శాఖ రెగ్యులర్ అధికారిని నియమించాలని ఎమ్మెల్యే ఎస్ఇతో ఫోన్లో మాట్లాడారు. ప్రభుత్వ చౌక దుకాణాల వద్ద సరుకుల పట్టి ,ధరల పట్టిక ఏర్పాటు చేయాలని తహశీల్దార్ ఆల్‌ఫ్రెడ్‌ను ఆదేశించారు. సూపర్వైజర్ శ్రీవాణి అంగన్ వాడీ కేంద్రాలకు కంది బ్యాళ్లు నవంబర్ నెల సరఫరా కానీ సమస్యను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ కంది బ్యాళ్లు పురుగు పట్టినవి ఉండడంవల్ల రాలేదని, గోదాం అధికారులతో మాట్లాడి వచ్చే విధంగా చేస్తామన్నారు. అనంతరం మండల వ్యవసాయ అధికారిని శారదా దేవి ఈక్రాప్ చేసుకున్న వారికి పంట నమోదు పత్రాన్ని ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్ చేతుల మీదుగా రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పార్టీలకు, కులమతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కూడా పరుగులు పెడుతుందని అన్నారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా మండలంలోని వివిధ గ్రామాలకు మెదటి విడత రూ.6 కోట్లు, 2వ విడత రూ. 11 కోట్లు మంజూరు కావడంతో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలోనే ప్రతి ఇంటికి నీటి కుళాయి కనెక్షన్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం, పశు వైద్య అధికారిని పద్మావతి, డాక్టర్ రాజ కుమార్, ఆయా శాఖల అధికారులు, సర్పంచులు మహేశ్వర్ రెడ్డి, గురువిరెడ్డి రాజారెడ్డి, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

నిరసన తెలుపుతున్న నాయకులు

కళ్లకు గంతలు కట్టుకుని టిడిపి నిరసన

ప్రజాశక్తి - మహానంది

సిఎం జగన్ పాలనలో దేవుడా మాకు ఇదేమి ఖర్మరా నాయనా అంటూ టిడిపి శ్రీశైలం ఇన్చార్జి బుడ్డ రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు సమన్వయకర్త బన్నురు రామలింగారెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు మహానంది-గాజులపల్లె రోడ్డుపై కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. గుంతల రోడ్డు లో ప్రమాదం జరుగుతున్న సంఘటనలు తెలియజేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఈ రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. చాలా పర్యాయాలు పత్రికలలో, ఎలాక్రానిక్ మీడియాలో కథనాలు వచ్చినా వైసిపి ప్రజాప్రతినిధులు ఏమీ పట్టనట్లు వున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు పట్టిన కర్మ పోవాలంటే జగన్ పోవాలని, చంద్రబాబు రావాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉల్లి మధు, యూనిట్ ఇంచార్జీలు చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, కాకర్ల శివ, మండల నాయకులు నాగ పుల్లయ్య, క్రాంతి కుమార్, ఆర్ఎస్ గాజులపల్లె సర్పంచ్ అస్లాం, మౌలాలి, వెంకటాద్రి, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, దస్తగిరి, నాగరాజు, రంగా, అబ్దుల్, శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

కొత్తూరులో మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం కొత్తూరు సుబ్రమణ్య స్వామిని కోడుమూరు మాజీ ఎమ్మెల్యే మణి గాంధీ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థాన సిబ్బంది సుబ్బారెడ్డి, ప్రధాన అర్చకులు నారాయణ స్వామి

అనారోగ్యంతో కాంతారెడ్డి మృతి

- నివాళ్లర్పించిన బైరెడ్డి సిద్దార్థరెడ్డి

పగిడ్యాల : పగిడ్యాల గ్రామానికి చెందిన కాంతారెడ్డి(70) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శాఫ్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి పగిడ్యాలకి చేరుకుని కాంతారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కాంతారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ఉమ్మడి జిల్లా ఖోఖో అసిసోయేషన్ చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి, వైసిపి నాయకులు చంద్రమౌళి, పల్లె సత్య నారాయణరెడ్డి, భూషిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమణరెడ్డి, సుధాకర్ ఉన్నారు.

క్రీడా సామాగ్రి వితరణ

చాగలమర్రి : చాగలమర్రిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఆడుకునేందుకు అవసరమయ్యే రూ.10 వేల విలువ చేసే క్రీడా సామాగ్రిని అదే పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయులు రవీంద్రా రెడ్డి హెచ్ఎం కోటయ్యకు శుక్రవారం అందజేశారు. క్రీడా సామాగ్రిని అందజేసిన ఉపాధ్యాయున్ని హెచ్ఎం ఆధ్వర్యంలో వ్యాయామ సంచాలకులు దాదాపీర్, పిఈటి భారతిలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గణిత దీప్తి ఆవిష్కరణ

కోవెలకుంట్ల : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యాశాఖ అధికారి తిమ్మారెడ్డి గణిత దీప్తిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గణిత ఉపాధ్యాయుల సమాఖ్య (ఎపిఎంఎఫ్) వారు పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించుటకు తయారు చేసిన గణిత దీప్తి స్టడీ మెటీరియల్‌ని ఆవిష్కరించామన్నారు. విద్యార్థులు ఈ మెటీరియల్ చక్కగా ఉపయోగించుకొని ఎక్కువ సంఖ్యలో ఉత్తీర్ణత, ఎక్కువ మార్కులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం రామకృష్ణయ్య, కమిటీ చైర్ పర్సన్ శ్రీనివాసులు, గణిత ఉపాధ్యాయులు శ్రీపతి, జ్యోతి, సిఆర్‌పి ముబినా పాల్గొన్నారు.

నంద్యాల వైద్యులకు ఉత్తమ సేవా అవార్డులు

నంద్యాల : తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జరిగిన 12వ అంతర్జాతీయ వ్యర్థ పదార్థాల సుస్థిర నిర్వహణ సదస్సులో శుక్రవారం నంద్యాలకు చెందిన వైద్యులు ఉత్తమ సేవా అవార్డులు అందుకున్నారు. ప్రముఖ వైద్యులు యూరాలజిస్ట్ భార్గవ వర్ధన రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, ఈశ్వరి, పనిల్ కుమార్‌లు అవార్డులు అందుకున్నారు.

రెండు రోజులపాటు ఓటరు నమోదు కార్యక్రమం

మహానంది : మహానంది మండలంలో శని, ఆదివారాల్లో రెండు రోజులపాటు ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తహశీల్దార్ జనార్ధన్ శెట్టి శుక్రవారం పేర్కొన్నారు. జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు తమ ఓటు హక్కును సంబంధిత గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్ల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం

ఆళ్లగడ్డ : నంద్యాల జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం రూరల్ సిఐ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రూరల్ స్టేషన్ పరిధిలోని చిన్న కందుకూరు గ్రామ మెట్ట వద్ద వాహనాలు తనిఖీ చేస్తూ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, దీనివల్ల మనకు జరిగే ప్రమాదాలను అరికట్ట వచ్చిన్నారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, డ్రైవింగ్ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలన్నారు.


వగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి

మహారాజశ్రీ నందికొట్కూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No.165/2020

బి.రమేష్ గౌడ్. ...వాది

ఎదిరి

జి.క్రిష్ణారావు.

...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

వాది తన బాకీ రాబట్టుకొను నిమిత్తం మీ పైన పై కోర్టులో దావా దాఖలు చేసి యున్నాడు. పై నంబరు దావా నందు కోర్టు వారి ప్రతివాదికి పంపిన దావా సమన్లు తీసుకొనకుండా తప్పించుకొనుచున్నందున ఇందు మూలంగా ప్రతివాదికి తెలియచేయడం ఏమనగా 12-12-2022వ తేదిన ఉదయం 10-30 గంటలకు నీవు స్వయంగా కానీ, వకీలు ద్వారా గాని హాజరై నీకున్న ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేని ఎడల దావాను మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేది : 12-12-2022

ప్రతివాది చిరునామా :-
గద్దాళె క్రిష్ణారావు,
తండ్రి జి.వెంకోబరావు,
ఇంటి నెం.15-120-98,
సాయిబాబాపేట,
నందికొట్కూరు పట్టణం,
నంద్యాల జిల్లా.

శ్రీ జె.వెంకటరాముడు,
వాదిపరం వకీలు,
నందికొట్కూరు పట్టణం.